రైతు జేఏసీ నాయకుల ముందస్తు అరెస్టు

ముందస్తు అరెస్టుతో గుమ్మడిదల పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల,మే 23: సంగారెడ్డి జిల్లా ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా 108 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రైతు జేఏసీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. శుక్రవారం జహీరాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరైన విషయం తెలిసిందే. జేఏసీ నాయకులు ప్యారానగర్ డంపింగ్‌యార్డును ఉపసంహరించుకోవాలని సీఎం సభకు వెళ్లి నిరసన వ్యక్తం చేయాలని మండలంలోని నల్లవల్లి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. దీంతో అప్రమత్తమైన గుమ్మడిదల పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున నల్లవల్లికి చేరుకుని జేఏసీ నాయకులు కుమ్మరి ఆంజనేయులు, కొరివి సురేశ్, మన్నె విజయరామకృష్ణ, పులిమామిడి రవీందర్, రాజుగౌడ్,మిర్యాల చంద్రశేఖర్, శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్యారానగర్ డంపింగ్‌యార్డును ఉపసంహరించుకోవాలని శాంతియుతంగా రిలేనిరాహారదీక్షలు చేస్తున్నా స్పందించని సీఎం రేవంత్ రెడ్డి సర్కారు సీఎం సభలో నిరసన వ్యక్తం చేయాలని పిలుపు నివ్వడంతో వెంటనే స్పందించిందన్నారు. ప్యారానగర్ డంపింగ్‌యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా నల్లవల్లిలో శాంతియుతంగా జేఏసీ నాయకులు డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేశారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడి హౌస్ అరెస్టు

జహీరాబాద్‌లో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డికి నిరసన సెగ తగలకుండా బీఆర్ఎస్ నాయకుడిని గుమ్మడిదల పోలీసులు ముందస్తు హౌస్ అరెస్టు చేశారు. శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని ఉదయం పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఆందోళనలు, రిలే నిరాహారదీక్షలు చేస్తున్నందుకే హౌస్‌అరెస్టులు చేశారని మండిపడ్డారు. శాంతియుతంగా ప్యారానగర్ డంపింగ్‌యార్డును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నందుకే హౌస్ అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రజల హక్కు అని అన్నారు. హౌస్ అరెస్ట్ చేయడం కాదు ముందుకు ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా డంపింగ్‌యార్డుపై స్పందించి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

గుమ్మడిదలలో బీఆర్ఎస్ నేత గోవర్ధన్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

బీఆర్ఎస్ నేత గృహనిర్బంధం అప్రజాస్వామికం

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి

గుమ్మడిదల, మే23 : డంపింగ్‌యార్డు నిర్మాణానికి వ్యతిరేకంగా శాంతియుతంగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని గృహనిర్బంధం చేయడం అప్రజాస్వామికమని రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కారుకు చిత్త శుద్ధి ఉంటే ముందు జహీరాబాద్‌లో నిర్వహించే సభలో ప్యారానగర్ డంపింగ్‌యార్డును రద్దు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గుమ్మడిదలలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి, పర్యావరణానికి విఘాతం కలిగించే డంపింగ్ యార్డును రద్దు చేయాలని ఆందోళన చేయడం న్యాయముందన్నారు. ప్రజల మనబావాలను అర్థం చేసుకొని ప్రభుత్వం డంపింగ్ యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల దేవేందర్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆంజనేయులు యాదవ్, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి నడిమంటి ఆంజనేయులు, వెంకటేశ్ యాదవ్ ఉన్నారు.

మెడికల్ ఘన వ్యర్థాల కాల్చివేతపై విచారణ

కొడకంచి గ్రామ శివారులో కాల్చివేతలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ శివరాజ్

జిన్నారం, మే 23 : భారీగా 'మెడికల్ ఘ న వ్యర్థాల కాల్చి వేత' శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఈనెల 20న ప్రచురితమైన కథనానికి గ్రామపంచాయతీ సిబ్బంది స్పందించారు. జిన్నారం మండలం కొడకంచి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రా ల్లో రెండు రోజుల కింద తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు మూడు చెక్క పెట్టెల్లో భారీగా మెడికల్ ఘన వ్యర్థాలను తీసుకు వచ్చి కాల్చి వేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పంచాయతీ కార్యదర్శి ఉమ మహేశ్వర్ ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి మాజీ సర్పంచ్ శివరాజ్ శుక్రవారం కాల్చివేతలు జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై గ్రామ మాజీ సర్పంచ్ శివరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం రైతులు, పశువులు, కాపరులు సంచరించే ప్రాంతంలో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వ్యక్తులపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాల్చివేతలు చేసిన ప్రాంతంలో మూడు చెక్క పెట్టెలను దుండగులు అలాగే వదిలివెళ్లడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా బాధ్యులైన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారిని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కారోబార్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి స్తంభించిన రాకపోకలు

రోడ్డుపై వర్షపునీరు చేరడంతో నిలిచిన వాహనాలు

నారాయణఖేడ్, మే 23 : నారాయణఖేడ్ ప్రాంతంలో కురిసిన భారీ వర్షం కారణంగా శుక్రవారం ఉదయం నారాయణఖేడ్– జహీరాబాద్ మధ్య కొద్ది సేపు రాకపోకలు స్తంభించాయి. నిజాంపేట్– బీదర్ 161బీ జాతీయ రహదారి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో వర్షపు నీరు రోడ్డుకి ఇరువైపులా తీసిన గుంతల్లోకి చేరి నీరు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం గుంతలో చేరిన నీటిని మళ్లించి రాకపోకలను పునరుద్ధరించారు. గురువారం రాత్రి 79.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారవర్గాలు తెలిపాయి.

13 కేజీల గంజాయి పట్టివేత

రామచంద్రాపురం, మే 23 : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కొల్లూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్‌బెంగాల్‌కి చెందిన బర్మన్, బిశ్వాస్ ఇద్దరు ఉస్మాన్‌నగర్‌లోని లెబర్ అడ్డాలో నివాసం ఉంటూ కూలీ పనిచేస్తున్నారు. వెస్ట్ బెంగాల్‌కి చెందిన కృష్ణను గంజాయి అడుగటంతో అతను విజయవాడ వరకు వచ్చి వీరికి 13 కేజీల గంజాయిని విక్రయించాడు. గంజాయి తీసుకొని బర్మన్, బిశ్వాస్ ఇద్దరు లేబర్ అడ్డాలో విక్రయించడం కోసం ఉస్మాన్‌నగర్ బస్‌స్టాప్‌లో ఉండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు.

సీఎం పర్యటనపై జహీరాబాద్ వాసుల నిరాశ

జహీరాబాద్, మే 23 : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో జహీరాబాద్ పట్టణంతో పాటు నియోజవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. జహీరాబాద్ పర్యటనలో భాగంగా శుక్రవారం మం త్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్ కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాలు, విన్నవించినప్పటికీ ఆశించిన మేరకు నిధులను మంజూరు చేయకపోవడంతో నిరాశకు గురయ్యారు. నిమ్జ్ ప్రాజెక్టులో భూములను కోల్పోతున్న 5,612 మంది బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇం డ్లను మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. జహీరాబాద్ మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. జహీరాబాద్ ప్రాంతంలోని చెరుకు రైతులు సొసైటీగా ఏర్పాటు చేసుకుంటే నిమ్జ్ ప్రాజెక్టులో పరిశ్రమ ఏర్పాటుకు భూమిని కేటాయించి, అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని అల్లాదుర్గ–బీదర్–మెదక్ రోడ్డుతో పాటు జహీరాబాద్–బీదర్ రోడ్డును జాతీయ రహదారులుగా మార్చేందుకు కేంద్రంతో మాట్లాడి నిధులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి కోరామని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. నారాయఖేడ్ నియోజవర్గ అభివృద్ధిని శాయశక్తుల కృషి చేస్తామన్నారు. సింగూర్ ప్రాజెక్టు సమీపంలో ఏకో టూరిజం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అభివృద్ధికి నిధుల కేటాయించకపోవంపై అసంతృప్తి

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జహీరాబాద్, మే 23 : మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. సీఎం రేవంత్ పర్యటనలోభాగంగా పస్తాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళ సహకార సంఘాలతో ఇండియాన్ అయిల్ ఔట్‌లేట్ (పెట్రోల్ బంకు) ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి దామోదర రాజనర్సిం హ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభు త్వం కృషి చేస్తుందన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్, స్మార్ట్ సీటీ ఏర్పాటుతో రానున్న రోజుల్లో పరిశ్రామిక రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు షబ్బీర్ అలీ, నిర్మలా జగ్గారెడ్డి, మదన్‌మోహన్, లక్ష్మీకాంత్‌రావు, సంజీవ్‌రెడ్డి, మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు ఘన స్వాగతం

జహీరాబాద్/కోహీర్/ ఝరాసంగం మే 23 : జహీరాబాద్ పర్యటనకు విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం లభించింది. శుక్రవారం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలి వద్ద మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మే 23 : జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి నిధులను కేటాయించి ఆదుకోవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సీఎం రేవంత్‌రెడ్డి వినతి పత్రాన్ని అందించారు. శుక్రవారం జహీరాబాద్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జహీరాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు సంగమేశ్వ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మైనార్టీల కోసం హజ్ హౌజ్, షాదీఖానా నిర్మాణానికి రెండు కోట్ల చొప్పున నిధులను మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని 150కి పైగా ఉన్న గ్రామాల అభివృద్ధికి ఒక్కొక్క గ్రామానికి రూ. 20 లక్షల చొప్పున నిధులను మంజూరు చేయాలన్నారు. జహీరాబాద్ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జగ్గారెడ్డికి జహీరాబాద్ బాధ్యతలు

- నిమ్జ్ భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్ల బాధ్యత జగ్గారెడ్డికే
- ఏహోదాలో అప్పగిస్తారంటున్న జహీరాబాద్ కాంగ్రెస్ నేతలు
- సీఎం నిర్ణయంపై ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి అసంతృప్తి ?

సంగారెడ్డి మే 23(నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం సొంత పార్టీ నేతలకు మింగుడుపడటంలేదు. శుక్రవారం జహీరాబాద్ నియోజకవర్గంలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభ వేదిక మీదుగా నిమ్జ్ భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించారు. నిమ్జ్‌లో భూములు కోల్పోతున్న 5612 మంది నిర్వాసిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు. భూ నిర్వాసితులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందేలా చూసే బాధ్యతను మాజీ ఎమ్మెల్యే, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి అప్పగిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభ వేదికపై నుంచి ప్రకటించారు. అంతటితో ఆగకుండా సీఎం రేవంత్ రెడ్డి 'జగ్గన్న నిమ్జ్‌నిర్వాసిత కుటుంబాలను ఓ ఫంక్షహాల్‌కు పిలిపించుకొని వారితో సమావేశం ఏర్పాటు చేసి భోజనాలు పెట్టు..అలాగే 5612 భూ నిర్వాసిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు పత్రాలు అందజేసే బాధ్యత నీదే' అన్నారు. జగ్గారెడ్డికి సంపూర్ణంగా సహకరించాల్సిందిగా జిల్లా అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన జగ్గారెడ్డికి జహీరాబాద్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడం స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులను విస్తుపోయేలా చేసింది. ముఖ్యంగా ఎంపీ సురేశ్ షెట్కార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేదని తెలుస్తుంది. జగ్గారెడ్డికి ప్రస్తుతం ప్రభుత్వంలో ఎలాంటి అధికారిక బాధ్యతలు లేవు. పార్టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జగ్గారెడ్డి పనిచేస్తున్నారు. ప్రభుత్వంలో ఏ అధికారిక హోదాలేని జగ్గారెడ్డికి జహీరాబాద్ నియోజకవర్గ నిమ్జ్ భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అప్పగించే బాధ్యతను సీఎం ఎలా అప్పగిస్తారని ఎంపీ సురేశ్ షెట్కార్, పార్టీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తుంది. సీఎం బహిరంగసభ ముగిసిన అనంతరం తమ అసంతృప్తిని మంత్రి దామోదర దృష్టికి ఇద్దరు నేతలతోపాటు ఇతర కాంగ్రెస్ నాయకులు తీసుకువెళ్లినట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు నష్టం వాటిల్లటంతో పాటు గ్రూపు రాజకీయాలకు మరింత ఆజ్యం పోసినట్లు అవుతుందని కాంగ్రెస్ నేతలు తమ ఆందోళనను మంత్రి వద్ద వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే జగ్గారెడ్డి మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు జహీరాబాద్ నియోజకవర్గంలోని నిమ్జ్ భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూసేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇదే విషయమై ఆయన త్వరలోనే జిల్లా అధికారులు, భూ నిర్వాసితులతో సమావేశం అయ్యేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.

కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

మేనేజర్ మధుసూదన్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

జిన్నారం, మే 23 : గడ్డపోతారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులతో కలిసి మున్సిపల్ కార్మికులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు కనీస సౌకర్యాలను కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చట్టబద్ధమైన సెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు, డెత్ స్కీం పోస్టులు వారి పిల్లలకు ఉద్యోగాలు, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించాలని కోరుతూ మున్సిపల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం

చెక్కు అందజేస్తున్న సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి

జిన్నారం, మే 23 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో నివసించే ఎలక్ట్రిషియన్ నక్క శ్రీనుబాబు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. చందానగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో విద్యుత్ వైరింగ్ పనులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తూ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి కుటుంబ సభ్యులు సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి కలిసి భవన యజమానితో చర్చించి కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. నష్టపరిహారంగా రూ.13 లక్షలు చెక్కు రూపంలో శుక్రవారం అందజేశారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

సమస్యలను జోనల్ కమిషనర్ హేమంత్‌కి వివరిస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 23 : భారతీనగర్ డివిజన్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్‌ను కోరారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ కార్పొరేటర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి పాల్గొని డివిజన్‌లో గ్రీన్ వేస్ట్ వ్యర్థాలను లిఫ్టింగ్ చేయడం లేదని, బాబ్కాట్ కొరత ఉన్నదని జడ్సీ దృష్టికి తీసుకువచ్చారు. మ్యాక్ సొసైటీ కాలనీకి వెళ్లే దారిలో భెల్ స్థలంలో చెత్తాచెదారం పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తుందని భెల్ యజమాన్యంతో చర్చించి శుభ్రం చేయించాలని చెప్పారు. ఎల్‌ఐజీ, అన్నమయ్య ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు పనులకు రూ.80 లక్షలు మంజూరు చేయాలన్నారు. ఆర్సీపురం డివిజన్‌లో ఉన్న పలు సమస్యలను కార్పొరేటర్ పుష్పానగేశ్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన జడ్సీ హేమంత్ సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో సహకారం అందజేస్తామని తెలిపారు.

మాజీ సర్పంచుల అరెస్టు

పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు రమేశ్, రవికిరణ్

కోహీర్, మే 23 : సీఎం పర్యటనను అడ్డుకుంటారని ముందస్తుగా బీఆర్ఎస్ మాజీ సర్పంచులను అరెస్ట్ చేశారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్ పర్యటన నేపథ్యంలో వారిని అదుపులోకి తీసుకుని కోహీర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమను అక్రమ అరెస్టులు చేయడం అన్యాయమని మాజీ సర్పంచులు రమేశ్, రవికిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వంగ్ధాల్ వాగుపై వంతెన నిర్మించాలి

వంగ్ధాల్ శివారులో వాగు ప్రాంతం

సిర్గాపూర్, మే 23 : మండలంలోని వంగ్ధాల్ గ్రామ శివారులోని వాగుపై వంతెన లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ప్రతియేటా వర్షాకాలంలో ఈ వాగు పెద్ద ఎత్తున పొంగి పొర్లి ప్రవహిస్తుందని చెప్పారు. ఆ సమయంలో రాకపోకలు నిలిచిపోయి ఇక్కట్లకు గురవుతున్నామని, నిత్యం బ్యాంకు లావాదేవీలు, ఇతరాత్ర అత్యవసర పనులపై వాసర్, కంగ్టి, తదితర ప్రాంతాలు స్థానికులు వెళుతుంటామన్నారు. సత్వరమే ఈ వాగుపై వంతెన నిర్మించి తమ వాహన రాకపోకల సమస్యను తొలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరుద్ర పురుగుల ఆగమనం

జిన్నారంలో దర్శనమిచ్చిన ఆరుద్ర పురుగులు

జిన్నారం, మే 23 : ఆరుద్ర కార్తె పేరు వినగానే మొదట గుర్తుకొచ్చేవి ఆరుద్ర పురుగులు. వాతావరణం చెల్లబడి తొలకరి జల్లులు కురవగానే నల్లని నేలపై ఇవి ఎర్రని బొట్లుగా మెరుస్తూ కనిపిస్తాయి. అయితే ఈసారి కొద్దిగా ముందే వచ్చేశాయి. వారం రోజులుగా వాతావరణంలో భిన్నమైన మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు తగ్గి వర్షాలు కురుస్తుండడంతో చల్లటి వాతావరణానికి ఆరుద్ర పురుగులు దర్శనమిచ్చాయి. మామూలుగా ఇవి కనిపిస్తే వర్షాలు పుష్కలంగా కురుస్తాయని రైతుల నమ్మకం. ఈ క్రమంలో జిన్నారం మండల కేంద్రంలో తొలకరి వర్షం పలకరింపులతోనే అందమైన ఎర్రటి ఆరుద్ర పురుగులు నేలపై కనిపించి అలరించాయి. ఆరుద్ర కార్తె రాకముందే పంట పొ లాల్లో కనిపించడం శుభసూచకమని రైతులు చెబుతున్నారు.

బోధకాలు వ్యాధిపై అవగాహన

ఆర్సీపురంలో బోధకాలు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

రామచంద్రాపురం, మే 23 : బోధకాలు వ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం ఆర్సీపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో పీహెచ్‌సీ డాక్టర్ కల్పన ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బోధకాల వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ కల్పన మాట్లాడుతూ బోధకాల వ్యాధి నిర్మూలనకు ప్రజలకు రక్తపరీక్షలు చేయనున్నారు. శనివారం రాత్రి 8గంటల నుంచి 10గంటల వరకు శ్రీనివాస్‌నగర్‌కాలనీ ప్రజలకు రక్తపరీక్షలు నిర్వహించనున్నారని కాలనీవాసులు సహకరించాలని ఆమె కోరారు.

శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు పర్చాలి



సిర్గాపూర్ : ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో నాగారం



నిజాంపేట్: ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈవో రాములు

సిర్గాపూర్, మే 23 : ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న ప్రాథమిక సులభ తరహ విద్యను పాఠశాలలో తప్పనిసరిగా అమలు పరచాలని ఎంఈవో నాగారం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సిర్గాపూర్ కస్తూర్బాలో ఉపాధ్యాయులకు నాలుగో రోజు వృత్యాంతర శిక్షణ నిర్వహించారు. ఈ ప్రక్రియను పరిశీలించిన ఎంఈవో మాట్లాడుతూ నూతన విద్యాంశాలు ఎప్పటికప్పుడు తెలియజేసేందుకే ఈ శిక్షణ అనివార్యమైందని పేర్కొన్నారు. విద్యా బోధన ప్రతి ఫలాలు పాఠశాలల్లో విద్యార్థులకు అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఆర్‌పీ, ఎంఆర్‌పీలు, సీఆర్‌పీలు, టీచర్లు ఉన్నారు.

నిజాంపేట్‌లో..

నిజాంపేట్, మే 23 : విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహిస్తున్నామని విద్యాధికారి ఎంఈవో రాములు తెలిపారు. 20వ తేదీ నుంచి 25 వరకు ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ కెపాసిటీ బిల్డిండ్‌పై నిజాంపేట్ మండల పరిధిలోని 39 పాఠశాలల 68 మంది ఉపాధ్యాయులకు నిజాంపేట్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నారు.

కంది తహసీల్దార్‌గా రవి కుమార్

బాధ్యతలు స్వీకరిస్తున్న రవికుమార్

కంది, మే 23 : కంది నూతన తహసీల్దార్‌గా రవి కుమార్ శుక్రవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆశాజ్యోతి సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా బదిలీపై వెళ్లారు. యా దాద్రి భువనగిరి జిల్లాలో పని చేస్తున్న రవికుమార్ బదిలీపై కందికి వచ్చారు.

మారిన విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు

కొండాపూర్, మే 23 : కొండాపూర్ మండల విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్లు మారినట్లు విద్యుత్ అధికారి సిద్ది రాజ్‌సింగ్ ప్రకటనలో తెలిపారు. టీజీఎస్‌పీడీసీఎల్ కొండాపూర్ మండలానికి సంబంధించిన ఫోన్ నెంబర్లు విద్యుత్ ఆపరేషన్ సదాశివపేట బి. వీరారెడ్డి 8712473147, కొండాపూర్ ఏఈ సిద్దారాజ్ ఆపరేషన్ 8712473155, మల్కాపూర్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ 8712473183, తొగర్‌పల్లి సబ్‌స్టేషన్ 33/11 కేవీ, కొండాపూర్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ, 8712473182, గొల్లపల్లి సబ్‌స్టేషన్ 8712473184 నంబర్లను కేటాయించారని ఏఈ సిద్దారాజ్‌సింగ్ తెలిపారు. బీఎస్ఎన్ఎల్ నెంబర్లు సిగ్నల్ సరిగ్గా రానందున ఎయిర్‌టెల్ నెంబర్లను అందించిందని పేర్కొన్నారు.

సైనిక్ స్కూల్‌కు రంజిత్ ఎంపిక

నిజాంపేట్, మే 23 : నిజాంపేట్ మండల పరిధిలోని బాచేపల్లి గ్రామానికి చెందిన అనురాధ దుర్గేశ్ కుమారుడు రంజిత్ అదే గ్రామంలోని ప్రైవేట్ లిటిల్ అప్పర్ ప్రైమరి స్కూల్‌లో 5వ తరగతి చదువుతూ సైనిక్‌స్కూల్ పరీక్ష రాశాడు. 300 మార్కులకు 204 మార్కులు సాధించి ఎంపిక కావడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌కు సిర్గాపూర్ తహసీల్దార్ సరెండర్

సిర్గాపూర్, మే 23 : కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ అబ్దుల్ నజీం ఖాన్‌కు ఖేడ్ ఆర్డీవో కలెక్టర్‌కు సరెండర్ చేశారు. తహసీల్దార్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కలెక్టర్ దృష్టికి ఫిర్యాదులు రావడంతో, కలెక్టర్ సూచనల మేరకు ఆర్డీవో శాఖ పర చర్యలతో కలెక్టర్‌కు సరెండర్ ప్రక్రియ వెళ్లడయ్యింది. స్థానికంగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు అంతరాయం కలుగకుండా కంగ్టి ఉప తహసీల్దార్ షేక్ అబ్దుల్ మొగినికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

జహీరాబాద్, మే 23 : మొగుడంపల్లి మం డలంలోని సత్వార్ గ్రామ చౌరస్తాలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక గ్రామ చౌరస్తా యూటర్న్ సమీపంలోని జాతీయ రహదారి –65 పక్కనే గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వయస్సు 40–45 మధ్య ఉంటుందని, మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపర్చినట్లు ఎస్సై తెలిపారు. శుక్రవారం బీట్ విధులను నిర్వహిస్తున్న సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొ న్నారు.

25న జీపీవో దరఖాస్తుదారులకు పరీక్షలు

సంగారెడ్డి, మే 23 : గ్రామపరిపాలన అధికారులు (జీపీవో)గా దరఖాస్తులు చేసుకున్న వీఆర్‌వో, వీఆర్‌ఏలు ఈ నెల 25న జరుగనున్న రాత పరీక్షలకు తప్పని సరిగా హాజరుకావాలని వీఆర్‌వో సంఘం నాయకులు సత్యనారాయణ కోరారు. ఈ పరీక్షలు పట్టణంలోని తార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10. 30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అర్హులుగా ఎంపికయిన 248 మంది దరఖాస్తుదారులకు జరుగుతాయని వివరించారు. జిల్లాలో 355 మంది వీఆర్‌వో, వీఆర్‌ఏలు ఉండగా 5 ఏండ్ల సర్వీసు ఉన్నవారిని అర్హులుగా పరిగణించి వారికే పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. మిగ తా 111 మంది అనర్హులుగా 5 ఏండ్ల సర్వీ సు, అర్హత చదువు లేని వారుగా గుర్తించి పరీక్షలు నిర్వహించడంలేదన్నారు. ఈ విషయాన్ని దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు గమనించి పరీక్షలకు హాజరుకావాలని సత్యనారాయణ సూచించారు.

హోరాహోరీగా మల్లయోధుల పోటీ

కల్హేర్, మే 23 : మండల పరిధిలోని మీర్ఖాన్‌పేట్‌లో గ్రామస్తుల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీలు ప్రారంభం నుంచి రసవత్తరంగా కొనసాగాయి. చివరి పోటీ కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం అంతాపూర్‌కు చెందిన వడ్డె గంగారాం, మహారాష్ట్ర నాసిక్ జిల్లా జాపూర్‌కు చెందిన యోగేశ్వర్‌రావు పటేల్ మధ్య హోరాహోరీగా జరిగింది. వడ్డె గంగారాం పోటీలో గెలిచి మొదటి బహుమతి రూ.11 వేలు, రెండో బహుమతి యోగేశ్వర్‌రావుకు రూ. 5 వేలు నగదును కుస్తీ పోటీల నిర్వాహకులు అందజేశారు.